PRAMUKHANDHRA
21st Year of Publication
We carry the news and views of Telugus

# ప్రముఖాంధ్ర

సంపాదకుడు
గోటేటి శ్రీరామారావు
₹15
డిసెంబర్ 2015
THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA




ॐ साई राम




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

డిసెంబర్ 2015

సంపుటి : 21 **252** సంచిక : 12




# చెన్నయ్‌లోనే తెలుగు భాష మూల వేరులున్నాయ్! చెన్నుగ తెలుగు మాట్లాడేవారున్నారు!

**తెలుగు భాషా ఖ్యాతిని బాగా పెంచిన తెలుగు భాషాకోవిదులు చెన్నయ్‌లో ఉన్నారు!**

**-చెన్నయ్ ఎపుడూ నాకు పరాయి ప్రదేశమనిపించడంలేదు!!-**

**ఆంధ్ర మహాసభా ఇక్కడే పుట్టింది; ఆంధ్ర మహిళా సభా ఇక్కడే పుట్టింది! ఆంధ్ర విజ్ఞాన సమితి ఇక్కడే పుట్టింది! వాల్మీకి రామాయణం తొలి తెలుగు పుస్తకం ఇక్కడ నుంచే వెలువడింది.**

సూర్యుడు అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యమన్నారు! తెలుగు అస్తమించని సామ్రాజ్యమంటూ వారందరి నోళ్లూ మూయించేసాం!

ప్రపంచంలో సూర్యుడు చొరబడని ప్రాంతం ఉండవచ్చు. కానీ తెలుగువాడుండని దేశం లేదు. ఆ దేశపౌరునిగా భావిస్తూ, తన తెలుగు భాషను వీడడం లేదు. చెన్నయ్‌లో అరవై అయిదు సంవత్సరాలుగా తెలుగువానిగా నేను ఇక్కడ నుంచే పొందుతున్న స్వానుభవం!

చెన్నయ్ చారిత్రక విభాత సంధ్యల్లోని భాషా వికాసంలో తెలుగే ప్రామాణికంగా ఉన్నది; ప్రధానంగా ఉన్నది!

ఆరున్నర దశాబ్దాల చెన్నయ్ తెలుగు వెలుగు దనాన్ని తలచుకున్నప్పుడు మసకబారుతున్న తెలుగు చీకటిదనానికి కారణ మెరుగలేకున్నాను.

తెలుగు నా మాతృభాష. నా చుట్టూ తెలుగువారున్నారు.

కొందరు మద్రాసు పుట్టినప్పట్నుంచి తెలుగు చదువుతారు. కొందరు తెలుగు మాట్లాడుతారు. వారు తెలుగువారే! తెలుగు భాషనే తొలిభాషగా తల్లిభాషగా భావిస్తారు. తొలి భాష తెలుగే!

తెలుగుభాషకు మహోజ్వల సింహపీఠం చెన్నయ్ వేసింది. తెలుగు భాషామతల్లి శారద ఆలయాన్ని శృంగేరి వారు కట్టారు. తెలుగు భారతి అన్నారు. సరస్వతి వాగ్విలాసం అన్నారు. లోక వ్యవహారానికి మరో ప్రాంతీయ భాషను మాట్లాడినా తప్పులేదు. మనం మన మాతృభాషను విస్మరిస్తేనే తప్పు.

తెలిసుండీ తప్పు చేసేవాడు పాషండుడు.

ఎవరికైనా, భాషా - జాతీ - దేశం ఇదీ క్రమం.

భారతదేశంలో తెలుగు ఎంతో విజ్ఞానాన్ని ఆవిష్కరింపచేసింది. తెలుగువారే నాణెములను తయారించారు; పురాతన బంగారు నాణాలను కనుగొన్నారు. బ్రిటిష్‌వారు నాణెం విలువను తెలుగులో మొదటి వరసన అచ్చొత్తించారు.

చందమామను గూర్చి, పున్నమి చంద్రికలను గూర్చి ఎంతైనా చెప్పవచ్చు.

రాయి రాయి పేర్చి ఆకు ఆకూ చేర్చి ఇళ్లు, మేడలు కట్టినవారు మనవారే! ఇదొక అంతులేని ప్రయాణం. అనంతమైన ప్రయాణమవుతుంది! నా ప్రయాణ యానం తెలియచేయడానికి అడ్డంకిగా నిలుస్తుంది.

ఆశతో, ఆర్ద్రతతో, ఆవేశంతో, అభినివేశంతో ఆరున్నర దశాబ్దాల క్రితం మా క్షీరపురి (పాలకొల్లు) నుంచీ చెన్నపురి (చెన్నయ్) వచ్చాను. రాజనాలు పండించిన రాగాల గోదావరి నుంచీ కొనీ - తెలుగు రాజస వైభవంగల చెన్నయ్ గురించీ తెలుసుకుంటూ వచ్చాను. ఇక్కడకు వచ్చిన తరువాత అన్నీ మొదట్నుంచే తెలుసు కోవడం మొదలుపెట్టాను. అంతర్గతంగా కొన్ని తెలుసున్నా- ఏంవీ తెలియనివానిలా అన్నీ తెలుసుకున్నాను.

జగమంత వెలుగునిచ్చిన తెలుగుకు కించిత్సేవైనా చేయాలని 21 సంవత్సరాల క్రితం 'ప్రముఖాంధ్ర'ను ప్రారంభించాను.

వేద ఇతిహాస, విజ్ఞాన కవి, గాయక, కళల నిలయమై ప్రభవించిన తెలుగు, చెన్నయ్‌లోనే చెలువొందుతున్నది. నన్నయ్య, తిక్కన, అన్నమయ్య, త్యాగయ్య, గోపయ్య (రామదాసు) పదకవితల సొగసు-

యతి ప్రాస స్వర సౌరభాలను చందోబద్ధంగా వ్యాకరణబద్ధంగా, ఒద్దుగా మురిపించిన తెలుగుకు ఓ దశాబ్దకాలం సేవ చేద్దామని భావించాను. కానీ 21 సంవత్సరాల దశకు వన్నె తెస్తుందని ఊహించలేదు.

ఇదంతా ఏడుకొండలవాని అనుగ్రహం.

జగమంతా ఉన్న తెలుగువారి అనుపమాన ప్రేమ.

చెన్నయ్ పట్టణమును చెన్నయ్ మహానగరంగా రూపులు దిద్దిన తెలుగు చూడ్కులు!

వేడ్కమీర చెప్పవలెననిన తెలుగుజాతి గొప్పదనం- ఏ జాతి యెదుటా, ఏ సందర్భంలోనూ, తీసిపోనిది తెలుగు జాతి. నా తెలుగుభాష ప్రథమవరుసలో మొదటనే ఉంటుందన్న విశ్వాసమే తక్క, నా ప్రతిభ లేస మంతయినను లేదంటున్నాను.



**ఆశీర్వదించడం మీ వంతు.**

**ఆశతో జీవించడం నా వంతు**

బుధజన విధేయుడు

***- గోటేటి శ్రీరామారావు***


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# తిరుమల శ్రీనివాసుని చక్రస్నానం... ముక్తి స్థానం

## స్వామివారి చక్రస్నానంతో మంగళకరంగా జరుగుతుంది!!-



ఏటేటా ఏడుకొండలవానికి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతాయ్. బ్రహ్మోత్సవ నామం బ్రహ్మాండ నామం. ధ్వజావరోహణం మంగళకరంగా గోవిందనామ స్మరణంతో మారుమోగుతుంది. జయ జయ ధ్వానాలతో గిరులన్నీ ప్రతిధ్వనిస్తాయ్. స్వామివారికి చక్రతాళ్వారు స్నానమే ప్రధానం! అర్చకులు పాలు, నేయి, పెరుగులతో అభిషేక కైంకర్యం చేస్తారు.

ఆలయాధికారులతో బాటు వేలాది భక్తులు చక్రస్నానంలో పాల్గొంటారు. కలియుగ వైభవంగా కలియుగ కారుణ్య మూర్తి – వేంకటేశ్వరునికి జరిగే గొప్ప కార్యక్రమం.

తెల్లవారుజాము శ్రీవరాహస్వామి ఆలయం చెంత పుష్కరిణిలో చక్రతాళ్వార్లకు స్నానం నిర్వహించే ముందు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి సరసన చక్రతాళ్వార్లుకు పాలు, పెరుగు, నెయ్యి ఇత్యాదులతో అర్చకులు అభిషే కైంకర్యాన్ని నిర్వహించి ధూప నైవేద్యంతో స్వామివారిని ప్రసన్నునిని చేస్తారు. ఉత్సవాల్లో చివరగా శ్రీమలయప్పస్వామిని శ్రీదేవి, భూదేవిలతో బంగారు తిరుచ్చిలో తిరువీధులలో ఊరేగిస్తారు. రాత్రి ఏడుగంటలకు మొదలగు ఈ కార్యక్రమం సుమారు గంటపాటు కొనసాగుతుంది. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరసామి బంగారు ధ్వజస్తంభం వద్దకు వేంచేస్తారు. గరుడునికి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలను నిర్వహిస్తారు. వేదపఠనం చేస్తారు. ధ్వజస్తంభంపై ఉన్న గరుడపటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా కిందికి దించుతారు. అనంతరం ధ్వజపటాన్ని ధ్వజావరోహణానికి వచ్చిన శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు. తర్వాత ఊరేగింపుగా గరుడాళ్వార్‌ను మండపానికి చేరుస్తారు. బంగారు వాకిలిలో స్వామివారికి శ్రవణానక్షత్ర ఆస్థానం నిర్వహిస్తారు. గరుడపటానికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చక్రస్నానం కార్యక్రమంలో తితిదే అధ్యక్షుడు, ఈవో, జేఈవో, ఐజీ, డీఐజీ, ఎస్పీ, సీబీఎస్‌వో తదితర అధికారులు పాల్గొంటారు. చక్రస్నానం ముక్తిస్థానం. ●



## శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము



# ధర్మాచరణ అంటే ఏమిటి?



శ్రీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతితీర్థస్వామివారు



జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విద్వశేఖర భారతీస్వామివారు

**వరమభయముదారం పుస్తకం చాక్షహారం**
**మణివలయ మనోజ్ఞైః పాణిపద్మై ర్దధానా।**
**సితవనలలామా కున్దముక్తాభిరామా**
**వసతు శశినిభాస్యా వాచి వాగ్దేవతా నః॥**

ధర్మాన్ని ఆచరించండి 'అంటే ఏమిటి? మేము ఏమి చేయాలి? ఏమిచేస్తే ధర్మాన్ని ఆచరించినట్లు' అనే ప్రశ్నలు చాలామంది మనల్ని అడగవచ్చు. ఆ ప్రశ్నలు చాలా సహజమైనవి. సరైన ప్రశ్నలు కూడ. ఈ ప్రశ్నలకు తగు సమాధానం లభించినప్పుడే మనకు ధర్మాచరణ సాధ్యమవుతుంది.

ధార్మిక వ్యక్తులుగా పరిగణించబడాలంటే మనం కొన్ని కట్టుబాట్లను అనుసరించాలి. ఆ కట్టుబాట్లు, నియమాలు ఏమిటి? మొదట మనకి అహంకారం పనికి రాదు. ధనవంతులమనో, విద్యావంతులమనో, అధికారం ఉన్నదనో అహంకారం ఉండవచ్చును. అహంకారం మన పతనానికి కారణమవుతుంది. పురాణాలను, చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఎందరో అహంకారం వలన నాశనమయ్యారు.

దుర్యోధనుడు అహంకారంతోనే నాశనమయ్యాడు. నన్ను ఎవరూ ఏమీ చేయలేరనెడి అహంకారంతో రావణాసురుడు నాశనమయ్యాడు.

శ్రీఆదిశంకరాచార్యులు ఇలా అన్నారు:

**మా కురు ధన జన యౌవన గర్వమ్।**
**హరతి నిమిషాత్ కాలః సర్వమ్॥**

ధనం, జనం, యౌవనం చూసుకుని గర్వపడవద్దు. ఎందుకంటే అవి శాశ్వతం కాదు. నేను ధనవంతుణ్ణి అని భావిస్తే ఆ ధనం ఎన్నిరోజులు మనవద్ద ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఒకప్పుడు చాలా పెద్ద ధనవంతులుగా ఉన్నవారు తరువాత కడుపేదవారుగా మారిన సంగతులు మనం చాలా విని ఉన్నాం. వారి ధనానికి ఏమయింది? తెలియకుండానే హారతి కర్పూరంలా హరించిపోయింది. విద్యావంతుణ్ణి అని గర్వపడుతుంటే, అంతకంటె పెద్ద విద్యావంతులు రావచ్చును. వాళ్లు తనను అవమానపరచకుండ ముందుగానే తలవంచుకొని కూర్చోవటం చాలా మంచిది. అధికారం, గౌరవం గురించి ఎక్కువ మాట్లాడవలసిన పనిలేదు. అధికారం ఉన్నంత వరకే గౌరవం, అధికారం నుంచి వైదొలగిన మరుక్షణం ఎవరూ పట్టించుకోరు. అందువలన ఇవన్నీ తాత్కాలికమే. కాబట్టి ఈ తాత్కాలికమైన వాటిని చూసి అహంకారమెందుకు?

ఏదీ శాశ్వతం కాదు. భగవంతుడొక్కడే శాశ్వతం. అందువలన మనం భగవంతుని మాత్రమే ఆశ్రయించాలి. భగవంతుని అనుగ్రహంతో సర్వమూ జరుగుతుంది. మనం చేస్తున్నామనుకోవటం పూర్తిగా తప్పు. మహాభారతంలో శ్రీకృష్ణుడు అర్జునునికి ఇలా చెప్పాడు : అర్జునా! నీవు ఏమి చేయగలవు? అంతా నేనే చేస్తున్నాను. నీవు నాకు పనిముట్టువు మాత్రమే' అర్జునునికి గొప్పయోధుడినని గర్వం. ఆ గర్వభంగం కోసం అర్జునుడు తన శక్తిహీనతను గ్రహించాలనీ, తాను యుద్ధంలో విజయం సాధించడం అంతా భ్రమ అని తెలుసుకోవాలనీ శ్రీకృష్ణుడు తలపెట్టాడు.

భీమునికి కూడా అలా గర్వం ఉండేది. శారీరకదారుఢ్యంలో, బలంలో, తనను మించినవారు లేరని భీముని గర్వం. హనుమంతుడు ఆయన గర్వాన్ని భంగపరిచాడు. అడవిలో భీముడు తిరుగుతున్నప్పుడు, హనుమంతుడు ముసలి కోతి రూపంలో భీముని మార్గానికి అడ్డంగా కూర్చున్నాడు. అప్పుడు వానరం తోక అడ్డంగా ఉండడంతో దానిని తీయమని భీముడన్నాడు. తాను తోక కూడా కదలించలేనంత బలహీనంగా ఉన్నాననీ, ఆ తోకను భీమునినే తొలగించమని హనుమంతుడు అన్నాడు. తోక నీచమైన వస్తువు కాబట్టి తన ఎడమచేతితో దానిని తొలగించ చూసాడు భీముడు. అది కదలలేదు. అప్పుడు కుడి చేతితో తొలగించబోయాడు. కుదరలేదు. రెండు చేతులతో భీముడు ప్రయత్నించాడు. తోక కదలలేదు. అప్పుడు భీముని గర్వం పటాపంచలయింది. ఆ వృద్ధ వానరంతో భీముడిలా అన్నాడు : "అయ్యా! నా అహంకారాన్ని క్షమించండి. మీరెవ్వరో మహాత్ములై యుంటారు కదా. నిజరూపాన్ని తెలియజేయండి". అప్పుడు హనుమంతుడు తన నిజరూపంతో ప్రత్యక్షమై తాను హనుమంతుడిననీ, భీముని గర్వాన్ని తొలగించటానికే తానావిధంగా చేశానని చెప్పాడు.

అసలు మనకు అహంకారమెందుకు? గర్వపడటానికి ఏమీలేదు. ధార్మిక జీవనాన్ని గడపటానికి గర్వాన్ని, పొగరును వదలిపెట్టాలి.

ఇక రెండవ విషయం. అన్ని ప్రాణుల పట్ల దయను పెంపొందించుకోవాలి. అవసరం ఉన్నవారికి సహాయపడాలి. ధనవంతులు ఆ ధనాన్ని ఎలా ఉపయోగించాలి? ఈ ప్రశ్నకు సమాధానం శాస్త్రాలలో చెప్పబడింది. అయితే ఈ ప్రశ్న మరో ప్రశ్నకు దారితీస్తుంది. మనం ఆస్తికులమా? నాస్తికులమా? దేవుడున్నాడనీ, పునర్జన్మ ఉన్నదనీ, వేదాలు అపౌరుషేయాలనీ, పరలోకం ఉన్నదనీ, ధర్మానికి కట్టుబడి ఉండటంలో నమ్మకమున్నవాడు ఆస్తికుడు. పైన చెప్పిన వాటిలో నమ్మకం లేనివాడు నాస్తికుడు.

ఆస్తికుడు విహిత ధర్మాలను ఆచరించాలి. అంటే తప్పక ఆచరించమని శాస్త్రాలు చెప్పిన ధర్మాలు. ఇతరులకు సహాయపడటం అటువంటి ధర్మము. ఆ ధర్మాన్ని ఆచరిస్తే ఇహపరలోకాలలో సుఖం లభిస్తుంది. మరు జన్మలలో కూడా ఉత్తమ జీవితాలు సంప్రాప్తిస్తాయి. ఆ విషయాలు దానం చేయటానికి ప్రోత్సాహాన్ని అందిస్తాయి. ఈ విషయాలలో దేనినీ నమ్మని నాస్తికుడు తన యావత్తు ధనాన్ని స్వసుఖానికే వాడుకుంటాడు. కొంతమంది పిసినారులుంటారు. అసలు తమ

ధనాన్ని ఖర్చుపెట్టరు. దాచిపెడ్తారు. తాము వాడుకోరు. ఇతరులకు ఖర్చుపెట్టరు. దానం చేయరు. బ్యాంక్‌లో తమ పేరుతో ఉన్న ఎకౌంట్‌ను చూసి మురిసిపోతుంటారు. అసలు సంపదను మనది అని అనుకోగలమా? మన సంతోషం కోసం వెచ్చించిన సంపద, దానం చేసిన సంపద మాత్రమే మనది. మిగతా ధనం కూడా మనదే అనుకోవడం ఒక భ్రమ. మన తరువాత ఆ ధనాన్ని ఎవరో వాడుకుంటారు. ఆ ధనానికి మనం సంరక్షకులం మాత్రమే.

**యద్దదాసి విశిష్టేభ్యః యదశ్నాసి దినే దినే।**
**తత్తే విత్తమహం మన్యే పరమన్యస్య రక్షసి॥**

అలా మనం కూడబెట్టి దాచిన ధనం మనది అని చెప్పుకోవటంలో అర్థంలేదు. ఒక బ్యాంకులో చాలా డబ్బు ఉంటుంది. కాని అది బ్యాంకు మేనేజరుదా? కాదు. అది వేరెవరిదో. మేనేజరు దానికి రక్షకుడు మాత్రమే. మన పరిస్థితి ఆ బ్యాంకు మేనేజరు వంటిదే. మన సంపదలో కొంత భాగాన్నైనా మనం వాడుకోవాలి. మిగిలినది దానం చేయాలి. అట్టి దానం వలన పుణ్యం లభిస్తుంది. మనం ఎంత దానం చేస్తే అంత పుణ్యం వస్తుంది. మనం సంపదను దానం చేయటం మన మంచికే.

భగవంతుని పూజకు మనం సమర్పించే వస్తువుల గురించి మనం గర్వపడవలసిన పనిలేదు. ఆ వస్తువులు భగవంతునికి అవసరం లేదు. మనం సమర్పించే వివిధ రకాల పూలుగాని, అభిషేకం కోసం సమర్పించే పాలుగాని, నైవేద్యంలో సమర్పించే వివిధ పదార్థాలు కాని భగవంతునికి అవసరం లేదు. మనశ్రేయస్సు కోసమే మనం అవి సమర్పిస్తున్నాం. అలాగే మనం చేసే దానాలన్నీ మన శ్రేయస్సుకోసమే. ఆ విషయం పట్ల మనకు నమ్మకమేర్పడితే మనం దానధర్మాలకు స్వచ్ఛందంగానే ఎక్కువగా వినియోగిస్తాము.

ఈ ఐశ్వర్యం భగవంతుని కృపవలన మనకు కలిగింది. ఈ ప్రపంచంలోకి మనం వట్టి చేతులతో వచ్చాము. శరీరంపై గుడ్డపీలిక లేకుండానే వచ్చాము. అలాగే ఈ ప్రపంచం నుండి వెళ్లిపోయేటప్పుడు వెంట ఏమీ తీసుకువెళ్లము. పుట్టుక, చావు మధ్య కాలంలో మనం సంపాదించిన సంపద భగవంతుని దయవలన సంపాదించినదే. ఈ సంపదను ఈ జన్మలోనే సత్కర్మలకు– అవసరమున్నవారికి సహాయపడటానికి దానధర్మాలకు ఉపయోగించాలని మనం గుర్తుంచుకోవాలి. అది బుద్ధిమంతుల లక్షణం కదా! ఇలా చేయకపోతే పాపం చేస్తున్నట్లే.

ఈ విషయంలో శ్రుతి ఇలా చెప్తోంది!

**మోఘమన్నం విన్దతే అప్రచేతాః।**
**సత్యం బ్రవీణ వధ ఇత్స తస్య।**
**నార్యమణం పుష్యతి నో సఖాయమ్।**
**కేవలాఘో భవతి కేవాలాదీ॥**

కేవలాది– తన సంపదను పూర్తిగా తన స్వార్థానికి మాత్రమే వినియోగించేవాడు. సమాజంలో వేరే ఎవరికోసం చిల్లిగవ్వ కూడా ఉపయోగించనివాడు. ఎవరికీ కించిత్తు కూడా సహాయపడనివాడు. పాపాన్ని కూడబెడ్తాడు. ఈ విషయం భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ కూడ చెప్పాడు.

మనం భగవంతుని కృపతోనే ధనాన్ని సంపాదించగలం. అందువలన భగవంతుని సేవలోనే ఆ ధనాన్ని ఉపయోగించాలి. లేకపోతే పాపం తప్పక వస్తుంది. మీ స్వసుఖానికి మీ డబ్బును ఖర్చుపెట్టవద్దని చెప్పలేదు. మీ సంపాదనలో కొంత భాగాన్ని మీ కోసం ఉపయోగించుకోవచ్చును. కానీ మీ అవసరం ఎంత? మీరు కోటీశ్వరుడైనా తినకలిగిన ఆహారం కొంతే కదా! బహుళ అంతస్థుల రాజమహల్‌లో నివసిస్తున్నా, పేదవాని గుడిసెలో నివసిస్తున్నా తినగల ఆహారం తక్కువే. అంతేకానీ కోటీశ్వరులమని చెప్పి ఎక్కువ తినలేము కదా! కాబట్టి మనం బ్రతకటానికి కొంత వాడుతూ ఎక్కువ భాగం అవసరమున్న వారి కోసం దానధర్మాల కోసం వాడాలి. అదే భగవంతుని కోసం వినియోగించటం. ●




# అనంతమైన ఐతిహాస వాఙ్మయాన్ని వ్యాసుడే అందించాడు

## -వాల్మీకి వ్యాసులు అనంత వాఙ్మయ సృష్టికర్తలు-

వేదాలు మనిషి ఉనికిని తెలియచేసాయ్. ఎలా ఉన్నతికి రావాలో ఎరుక పరిచాయ్. ఏది చేయకూడదో తెలిపాయ్. ఏది సన్మార్గమో తెలిపాయ్. తిండితినడం నుంచీ తనువు చాలించే వరకూగల జీవితాన్ని తెలిపాయ్. సాహిత్య సారస్వతములు శ్రవణంగానే అధ్యయనం చేయాలనెడి ఉత్కృష్ట విధానాన్ని అలవరింపచేసిందీ భారతదేశం! భూఖగోళ శాస్త్రాధ్యయనం ద్వారా భూత, వర్తమాన, భవిష్యత్కాల విషయాల నెరిగింపచేసినది భారతదేశమే! ప్రాక్పశ్చిమ దేశాలకు భారతదేశమే గురువు! ఏ దేశం ఏఏ విజ్ఞానము నలవరచుకున్నా–భారతదేశాన్నుంచే గ్రహించారు.

వ్యాసభగవానుడు అష్టాదశ పురాణాలను, భారతాన్ని రచించిన రచయిత. ఆయన జననం, ఆయన జీవితం అన్నీ దైవ సంకల్పాలే! భారత యుద్ధం ముగిసాక గాంధారి ధృతరాష్ట్రులు తదితరులు ధర్మరాజుకు వీడ్కోలు పలికి వానప్రస్థం కోసం వనాలకు వెళ్లారు. అడవులలో కాలం గడుపుతున్నా, ధృతరాష్ట్రుని తన పుత్రులు, బంధువులు అంతా కురుక్షేత్ర రణరంగంలో అసువులుబాసిన సంఘటన ఆయనను బాధిస్తుండేది. దుర్యోధనుడు విగత జీవుడయ్యాడన్న విషయం నుంచీ ఆయన తేరుకోలేకపోతున్నాడు. గాంధారి, కుంతి లాంటి వాళ్ల పరిస్థితి కూడా అలానే వుంది. ఓ రోజున ధర్మరాజు ధృతరాష్ట్రాదులను చూసిరావాలని వారి ఆశ్రమాలకు బయలుదేరాడు. అదే సమయానికి భారతయుద్ధంలో మరణించిన తన బంధువులు, మిత్రులు ఏయే లోకాలలో, ఎలా ఉన్నారో ఒక్కసారి చూడాలని ఉందని తనకా భాగ్యాన్ని ప్రసాదించమని వ్యాసభగవానుని కోరుకున్నాడు. వ్యాసభగవానుడు వెంటనే గాంధారి ధృత రాష్ట్రాదులతో ఆ రోజు రాత్రికే వారివారి బంధువులను, మిత్రులను చూసేందుకు అవకాశం కల్పిస్తానని రాత్రి గంగానది ఒడ్డుకు రమ్మనమన్నాడు. ఆ రోజు సాయంత్రం నిత్యకృత్యాలన్నీ తీర్చుకుని వ్యాసభగవానుడు చెప్పినట్లు అందరూ గంగానది ఒడ్డుకు చేరారు. వ్యాసుడు మెల్లగా గంగానదిలోకి దిగి కురుక్షేత్ర రణరంగంలో మరణించిన వారందరినీ పిలిచాడు. గంగానది నుండి రణరంగం జరుగుతున్నప్పుడు వినిపించే కోలాహల ధ్వనుల వంటి వినిపించాయి. మరుక్షణంలో భీష్ముడు, ద్రోణుడు లాంటి పెద్దలు ముందు వరుసలలో ఉండగా, యుద్ధరంగంలో మరణించిన ఆనాటి రాజులు, యువరాజులు అంతా అక్కడ ప్రత్యక్షమయ్యారు. యుద్ధ సమయాలలో ఎలాంటి వేషధారణలతో, ఏ రథాలతో ఉన్నారో అచ్చు అలానే వారంతా అక్కడ కనిపించారు. అందరూ ఎంతో ప్రశాంతచిత్తంతో మనసులలో కానీ, ముఖాలలో కానీ ఎలాంటి రాగద్వేషాలు లేకుండా ఉన్నారు. ఆకాశం నుండి గంధర్వులు గానాలాపాన చేశారు. ఇవన్నీ చూడటానికి వ్యాసుడు ధృతరాష్ట్రుడికి దివ్యనేత్ర దృష్టిని అనుగ్రహించారు. అక్కడ ఉన్నవారంతా ఆ అద్భుత దృశ్యాన్ని కన్నార్పకుండా చూడసాగారు. అలా ప్రత్యక్షమైన వారిలో ఎవరి వారి దగ్గరకు వారు వెళ్లి కలుసుకున్నారు. ఆ రాత్రంతా ఎంతో హాయిగా గడిపారు. మళ్లీ తెల్లవారబోతుందనగా వ్యాసశక్తితో ప్రత్యక్షమైన వారంతా గంగానదిలో ప్రవేశించి ఎలా వచ్చారో అలాగే అంతర్థానమయ్యారు. తర్వాత వ్యాసుడు అక్కడున్నవారిలో యుద్ధంలో వీరస్వర్గం అలంకరించిన వారి భార్యలతో ఎవరైనా వారి భర్తల వద్ద వెళ్లదలచుకుంటే వెంటనే వెళ్లి గంగానదిలో మునగమని చెప్పాడు. అక్కడున్న వీరనారులంతా అలానే చేసి తమ భౌతిక దేహాలను విడిచి, తమ తమ వారు ఏఏ లోకాలలో వుంటే ఆ లోకాలన్నింటికి చేరుకున్నారు. ఇలాంటి సంఘటన నమే మరోమారు కూడా జరిగింది. వైశంపాయనుడు చెపుతుండగా జనమేజయ మహారాజు మహాభారతాన్నంతా దీక్షతో శ్రద్ధగా ఆలకించాడు. మరణించిన తనతండ్రిని ఒకమారు చూడాలని అనిపించింది. అదే విషయాన్ని జనమేజయుడికి చెప్పాడు. ఆ సందర్భంలో వ్యాసభగవానుడు అక్కడ ఉండటంతో ఆయన జనమేజయుడి కోరికను తీర్చేందుకు పరీక్షిన్మహారాజును పిలిచాడు. పరీక్షిత్తు కూడా వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. మరణించిన తన తండ్రి మళ్లీ కనిపించేసరికి జనమేజయుడి ఆనందానికి అవధుల్లేవు. ఇలాంటి అద్భుతాలను వ్యాసభగవానుడు ఎన్నింటినో భారత కథాసందర్భంగా పలుమార్లు చూపించాడు. ●



### తెలుగువారి వరప్రసాదుడు

# కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి!

### 17 నవంబర్ వరప్రసాదుని పుట్టినరోజుకు ప్రముఖాంధ్ర పలికిన పంచదార పలుకులు!

**రా**మాయణంలో ఓ రమణీయమైన సౌవర్ణనం ఉన్నది. వాల్మీకికా సౌందర్య సౌవర్ణికం యెలా స్ఫురించిందా అనుకుంటూ అగాధమైన ఆలోచనచేస్తూండేవాణ్ణి.

**శ్రీ**రాముడు సుందరుడట. రామకథ సుందరమట, సీత సుందరమట. వనం సుందరమట, ఆంజనేయుడు సుందరమట. శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే– అన్న సుమంత్రమూ సుందరమట. నిజానికి వీటిల్లో సుందరం కానిదేం వుంది. ఇన్ని సుందరాలను మేళవించుకున్నది కనుకనే ఆంజనేయుని లంకా పర్యాటక కాండ **సుందరకాండ**– యింది.

**వా**క్కు సత్యంగా, సరళంగా, స్వచ్ఛంగా, సరసంగా, సమధురంగా, సుస్వరంగా, వ్యాకరణ దోషముల్లేకుండా, వాక్ప్రలాపంగాకుండా, వాగ్భూషితంగా ఉండడం యుక్తమైనది – అని అగస్త్యునికి సుబ్రహ్మణ్యస్వామి చెప్పినట్లు చదివాను.

మాట మృదులంగా, మధురంగా, మంజులంగా, మనోహరంగా, మంగళ ప్రదంగా, మర్యాదకరంగా ఉన్నప్పుడు మహితాత్ముల మన్నలందుతుంది. ప్రథమ ప్రసంగ సమాగంలోనే వరప్రసాదరెడ్డి గారి వద్ద నాకానుభవం కలిగింది.

వేదాది పురాణేతిహాసాల్లో గల భారతీయ వాఙ్మయసారాన్ని అంతగా గ్రహించినవారు లేరు.

**ఆ**నాడు విద్యా ప్రారంభ సమయంలో పెద్ద బాలశిక్షను చదివింపచేసేవారు. పురాణేతిహాస విజ్ఞానం అందు విదితమయ్యేది. ఇప్పటి విద్యావిధానం అంతా ఉద్యోగపరమార్థంగానే సాగుతూన్నది. క్రిష్టియన్ పాఠశాలల్లో వలె ఆంగ్లములోనే విద్య సాగుతున్నది. భారతీయాన్ని గ్రహించే అవకాశం లేదు.

**న**వంబర్ నెల ఉత్తరార్థంలో పుట్టినవారు గొప్పవారవుతారని చదివాను. వాళ్లు వేదాంతులైనా కావచ్చు. సైంటిస్టులయినా కావచ్చు. రెండూ కావచ్చు. వాళ్లే దేశప్రయోజకులు.

**వ**రప్రసాదరెడ్డి ఉపన్యాసంలో ఓ ఉన్నతమైన వాక్సంపద, నా వీనులను ఆనందింప చేసింది. వారినీ, వారి వాగ్వాణినీ, విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య ద్వైవార్షిక మహాసభల్లో గ్రహించాను. బయటకు వచ్చే ద్వారం వద్ద నిలిచి– రెండే రెండు మాటలను వారితో మాట్లాడాను. అటు తరువాత తిరుపతిలో జరిగిన 'మహద్భాగవతసభ'నందు ఆత్మీయ గురువరేణ్యులు కందుకూరి శివానందమూర్తి మహోదయుల సమక్షంలో మరు రెండు నిమిషాలు మాట్లాడాను.

వారిచ్చిన విజిటింగ్ కార్డు అడ్రసుకు 'ప్రముఖాంధ్ర'ను పంపిస్తున్నా– వారికి పత్రిక చేరడం లేదన్న వార్తను విని, ఖిన్నుడనయ్యాను.

ఓ అపజయం వెనుక విజయం ఉంటుందంటారు. వారితో 10 నిమిషాలు మాట్లాడడం ఆ వెనుక 2015 సం॥ములో వచ్చిన 'ప్రముఖాంధ్ర'లను ఆధ్యాత్మ రామాయణం గ్రంథాన్ని వారికి పంపడం జరిగింది. వారి మనసులో పత్రికా సంపాదకుణ్ణనే భావం ముద్రితమైంది.

నా సహస్రచంద్రపూర్ణ దర్శనం సందర్భములో వారు పంపిన రూ. లక్ష రూపాయల చెక్కుకన్నా, వయసు మలుపుల్లో వచ్చే పుట్టినరోజులకుండే వైశిష్ట్యాన్ని విదితపరచిన వారి విజ్ఞానసంపదను ఈ రోజు వరకూ పునశ్చరణం చేసుకుంటు న్నాను.

వారి అభివృద్ధికి ప్రధాన కారణం వారి అమ్మగారిపై వారికి గల అపారమైన భక్తీ, అనురాగమే! వారు తమ ఫార్మస్యూటికల్స్‌కు శాంతా బయోటెక్నిక్స్ అని పేరు పెట్టడంలో ఆంతర్యం తల్లిపై గల ప్రేమే. చిన్నప్పుడు తెలుగు సినిమాల్లో 'తల్లిని మించిన దైవం వేరే ధారుణి లేదోయి' అన్న పల్లవి ఇప్పటికీ నా మనసులో ప్రతి ధ్వనిస్తూనే ఉంటుంది.

ఆయన చదువుకున్న విద్యకూ, చేస్తున్న వ్యాపారానికి పొంతనలేదు. ఎలెక్ట్రానిక్ ఇంజనీర్ పట్టాను పొందారు. కంప్యూటర్‌సైన్సు డిప్లమో అందుకున్నారు. ఎంబీఏ డిగ్రీ నందుకున్నారు. సైంటిస్టు డిగ్రీ అందుకున్నట్లు లేదు. ఇదే భగవంతుని లీలా మానుష్య విశేషణం.

ముక్కుమూసుకుని జపం చేసే భరద్వాజమహర్షి అంతరిక్షంలో పయనించే విమానాన్ని తయారించాడు. అందు ఏ యంత్రాలు నిక్షిప్తం చేసాడు? ఇంధనం యెక్కణ్ణుంచీ తెచ్చాడు?

ఇవన్నీ భగవత్సంకల్పాలు. వరప్రసాదరెడ్డి కనుగొన్న వ్యాక్సిను ఎంతో మంది ప్రాణాలను రక్షించింది. ఎన్నో కోట్ల రూపాయల్ను విదేశీ మారకదిశగా పోకుండా చూచింది. ఎన్నో అంటువ్యాధులనూ, ఎన్నో తీవ్రవ్యాధులను పేదసాదలకు కొద్ది ధనంతో ఆరోగ్యరక్షణ 'సంజీవి' అయింది.

మనదేశంలో, మన రాష్ట్రంలో ఈ ఔషధోత్పత్తి జరిగింది.

మన తెలుగువాడే మనదేశానికీ ప్రయోజనకరంగా– ఈ టీకాను కనిపెట్టాడు. పరిశోధనా ఆయనిదే! పరిశ్రమా ఆయనదే! మార్కెటింగూ ఆయనిదే!

ఆయన్ను గౌరవిస్తూ జాతీయాంతర్జాతీయ విద్యాలయాలు అవార్డులిచ్చాయ్. భారతప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదుతో 2005లోనే సత్కరించింది.

ఆయన పదహారణాల హిందూ సాంప్రదాయకుడు. ఆపాదమస్తకమూ హిందూ సంస్కృతీ ఆయనలో ప్రవహిస్తుంటుంది. 2000 సంవత్సరములోనే ఆరోగ్యపరిరక్షణా యువశ్రేణి పారిశ్రామికునిగా గుర్తింపు పొందారు. అప్పట్నుంచీ ప్రశంసల వర్షం వర్షిస్తూనే ఉంది. ఈ ప్రతిభాసంపన్నుని పెంపుతనం ఆరోహణాక్రమంలో సాగుతోంది. సర్వలక్షణ సంపత్కర్తుడైన వరప్రసాదునిలో గర్వమతిశయం ఇసుమంతయూ, కనపడదు. ఆ గర్వలక్షణ గరిమ ఈ వరప్రసాదుని వద్ద పరాభవింప బడింది. పది కాలాలపాటు వరప్రసాదుడూ, వారి కుటుంబసభ్యులు వర్ధిల్లాలని ప్రముఖాంధ్ర ఆశీర్వదిస్తున్నది. ●

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464



# సుబ్రహ్మణ్య షష్ఠి వైభవం

సుబ్రహ్మణ్యస్వామి అందరిలో ప్రకాశించే చైతన్య ప్రకాశం. కాబట్టి స్వామిని 'గుహ' అని అన్నారు. ఈ తత్త్వజ్ఞాన లక్షణం స్వామిలో ఉండడం వల్ల స్వామిని 'గురుగుహ' అని కొలుచుకుంటున్నాం. స్వామి జననంలో అనేక తాత్త్విక మర్మాలు దాగి ఉన్నాయి. పరతత్త్వం, అవ్యక్తం నుంచి జగద్రూపం తీసుకునే పరిణామక్రమంలో కుమారస్వామి జననం ఏర్పడింది.

దక్షయజ్ఞంలో సతీదేవి దేహత్యాగం చేసిన అనంతరం పరమశివుడు వైరాగ్యంలో మునిగిపోయాడు. శోణపురాధీశ్వరుడైన తారకాసురుడు శివుని కుమారుని వల్ల మరణం సంభవించునని తెలుసుకున్నాడు. వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయని తారకాసురుడు బ్రహ్మదేవుని గురించి ఘోరమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వరాన్ని కోరుకోమన్నాడు. శివకుమారుని వల్ల మరణం సంభవించకుండా వరమును కోరుకున్నాడు. బ్రహ్మ తథాస్తు అని అదృశ్యమయ్యాడు.

అలా బ్రహ్మ ఇచ్చిన వరంతో అజేయుడైన తారకాసురుడు దేవతలపై దండెత్తాడు. ఋషులను వివిధ రీతులుగా హింసించసాగాడు. అతని చేతిలో చిత్తుగా ఓడిపోయిన ఇంద్రుడు బ్రహ్మదేవునితో మొరపెట్టుకున్నాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ఇంద్రునితో "యోగనిష్టలో ఉన్న శివునికి పార్వతీదేవితో పెళ్లిచేస్తే, వారికి పుట్టే కుమారుడు దేవసేనాధిపత్యాన్ని వహించి తారకాసురుని సంహరించడం జరుగుతుంది" అని చెప్పాడు. అప్పుడు ఇంద్రాది దేవతలు మన్మథుని సాయంతో శివపార్వతులకు కళ్యాణం జరిగేటట్లు చేశారు.

తారకాసురునికి శివపార్వతుల పెళ్లి విషయం తెలిసి, అందుకు ప్రయత్నించిన దేవతలపై ఒక్క ఉదుటున దండెత్తాడు. మార్గశిర శుద్ధషష్ఠినాడు శివపార్వతులకు కుమారస్వామి జన్మించాడు. ఆ విధంగా జన్మించిన కుమారస్వామి తారకాసురునిపై దండెత్తి, యుద్ధం చేసి తారకాసురుణ్ణి సంహరించాడు.

సుబ్రహ్మణ్యస్వామి జననం గురించి మరొక పురాణగాథ ఉన్నది. పార్వతీ పరమేశ్వరులు విద్యా, విలాసగోష్టిలో ఉండగా, కైలాసానికి చేరుకున్న దేవతలు తమను 'శూరపద్ముడు' అనే రాక్షసుడు విపరీతంగా బాధిస్తున్నాడని విన్నవించుకున్నారు. శూరపద్ముని దుశ్చర్యలు శివునికి కోపం కలగడంతో తన మూడవ కన్ను తెరిచాడు.

ఆ మూడవ కన్ను కోపాగ్ని నుంచి ఆరు స్ఫులింగాలు ఉద్భవించాయి. ఆ స్ఫులింగాల కాంతిని చూడలేక, వేడికి తాళలేక దేవతలు, ఆ వేడిని, కాంతిని తగ్గించమని శివుణ్ణి వేడుకున్నారు. అప్పుడు వాయువును, అగ్నిని ఆహ్వానించాడు శివుడు. ఆ స్ఫులింగాల వేడిని, కాంతిని తగ్గించడంలో దేవతలకు సహాయం చేయమని వారికి శివుడు ఆనతిని ఇచ్చాడు. అగ్నివాయువులు ఆ వేడిని, కాంతిని తగ్గించారు. అనంతరం దేవతలంతా ఆ స్ఫులింగాలను తీసుకొని వెళ్లి, హిమాలయాల్లోని గంగానది పుట్టిన ప్రదేశంలో ఉన్న ఓ సరస్సులో పడేశారు.ఆ సరస్సులో పడిని ఆ స్ఫులింగాలు అక్కడ దుబ్బుల్లో అలల తాకిడికి ఏకమయ్యాయి. వాటి నుంచి ఆరు ముఖాలతో, పన్నెండు చేతులతో, రెండు కాళ్ళతో సుబ్రహ్మణ్యస్వామి మార్గశిరశుద్ధ షష్ఠినాడు ఆవిర్భవించాడు. తేజోరాశిగా వెలిగిపోతున్న ఆ స్వామిని చూసిన సమస్త దేవతలు అనేక స్తోత్రాలు చేశారు. ఆ రకంగా ఆవిర్భవించిన కుమారస్వామి శూరపద్ముడిని సంహరించారు.

మార్గశిర శుద్ధషష్టిని సుబ్రహ్మణ్య షష్ఠి అని జరుపుకుంటారు. మనము ఆ పర్వదినాన్ని 'సుబ్బారాయుని షష్ఠి' అని జరుపుకుంటాం. కానీ ఈ పర్వదినాన్ని తమిళులు 'స్కంధషష్ఠి' అని పిలుచుకుంటారు. తమిళులు తమ ఇంటి నుండి లేక దేవాలయం నుండి 'కావడి'ని మోసుకుని కుమారస్వామి దేవాలయానికి వెళ్తుంటారు. ఈ కావడి కుండలను పంచధార లేక పాలతో నింపుతుంటారు. ఈ కావడి కుండలను గురించి ఓ కథ కలదు.

పూర్వం అగస్త్యముని కైలాసానికి వెళ్లి శివుని దర్శనంచేసుకుని తిరుగుముఖం పడుతుండగా, శివుడు అగస్త్య మహామునికి వీడ్కోలు పలికి, బహుమానంగా రెండు కొండలను ఇచ్చాడు. ఆ కొండలను దక్షిణ భారతావవనికి తీసుకెళ్లి, ఒక చోట నెలకొల్పి, శివశక్తి రూపంగా పూజించాలని చెప్పాడు. అయితే అగస్త్యమహర్షి ఆ కొండలను కదిలించలేక, అచ్చటనే వదిలేసి దక్షిణ భారత భూభాగానికి వెళ్లాడు. అలా వస్తుండగా దారిలో అతినికి 'ఇడుంబుడు' అనే రాక్షసుడు ఎదురైనాడు. అతను, తనని శిష్యునిగా స్వీకరించవలసిందంటూ అగస్త్యమహర్షిని వేడుకున్నాడు.

అప్పుడు కైలాసపర్వతం దగ్గరున్న ఆ రెండు కొండలను దక్షిణాదికి తీసుకునివచ్చి, నెలకొల్పితే శిష్యునిగా స్వీకరిస్తానని అగస్త్యుడు ఇడుంబుడితో చెప్పాడు. అందుకు అంగీకరించిన ఇడుంబుడు అనంత, తక్షక, సంగపాలి, గుళిక, పద్మ, మహాపద్మ, కర్కోట అనే ఎనిమిది నాగులను కావడికి తాడుగా కట్టుకుని బ్రహ్మదండాన్ని కావలి బద్దగా చేసుకొని ఒక్కొక్క కొండను ఒక్కొక్క మట్టులో పెట్టుకుని కైలాస పర్వతం నుంచి దక్షిణాదికి బయలుదేరాడు. అలా ఇడుంబుడు పళని క్షేత్రానికి వచ్చేసరికి కాస్త ఆయాసంగా ఆ రాక్షసునికి అనిపించడంతో అక్కడ కాసేపు కావడిని దింపాడు.

అలసట తీరిన తర్వాత ఇడుంబుడు కావడిని ఎత్తడానికి ప్రయత్నించాడు. కానీ ఒక ప్రక్క కొమ్ము లేచింది కానీ, రెండవ ప్రక్క కొమ్ము పైకి లేవలేదు. కదలలేని కొమ్మువైపు ఉన్న కొండను పరిశీలించగా అక్కడ సుబ్రహ్మణ్యస్వామి వారు కనిపించాడు. వెంటనే ఇడుంబుడు స్వామివారితో యుద్ధం చేయడానికి ప్రయత్నించాడు. స్వామి ఆ రాక్షసుని సంహరించడానికి ప్రయత్నించుచుండగా ఆ రాక్షసుని భార్య అక్కడికి వచ్చి స్వామివారి పాదాలపైపడి పతిభిక్ష పెట్టమని ప్రాధేయపడింది. ఆమె పతిభక్తిని మెచ్చుకున్న సుబ్రహ్మణ్యస్వామి అతనిని తన ద్వారపాలకునిగా చేసుకున్నాడు. అప్పటి నుంచి పళనిక్షేత్రంలో స్వామికి కావడి కుండలను సమర్పించడం ఓ ఆచారంగా ఏర్పడినది.

ఈ మార్గశిర షష్ఠిని స్వామివారి జన్మదినంగా భావించి సుబ్బరాయుడి షష్ఠిగా వేడుకలు జరుపుకుంటారు. షష్ఠిరోజున ప్రాతఃకాలంలో నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకొని, అభ్యంగనస్నానం చేసి, శుచిశుభ్రత గల సంప్రదాయ దుస్తులను ధరించి, ఉపవాసం ఉండి సుబ్రహ్మణ్యస్వామిని పూజిస్తారు. స్వామివారిని షోడశోపచారాలు, అష్టోత్తర శతనామావళితో గణపతి పూజ అనంతరం పూజించి, నైవేద్యాన్ని సమర్పించాలి. ఆరోజు బ్రహ్మచారికి వస్త్రదానంచేసి భోజనంపెట్టి కానుకలను ఇవ్వాలి.

కొంతమంది సర్పదోషం ఉన్నవారు స్వామివారిని సర్పాకారంగా తలచుకుంటూ, పుట్టలో పాలు పోస్తుంటారు. ఇక కుజదోషం ఉన్నవారు ఆ రోజున ఉపవాసం వుండి, సర్పదేవతలను ప్రార్థించి, పుట్టలో పాలు పోస్తూ తమ దోషాలను పోగొట్టమని స్వామిని వేడుకుంటారు. శరవణుడు, షణ్ముఖుడు అనే నామాలతో కూడా కుమారస్వామిని పిలుస్తారు.

– **కె. మల్లిఖార్జున,** బళ్లారి

# ఊర్ధ్వదృష్టి గల మోడీని హ్రస్వ దృష్టితో చూడవద్దు!

ఏ జాతీయ పార్టీ భారతదేశ సంస్కృతినీ, సంపదలనూ అధోగతికి తెచ్చిందో! ఏ పార్టీ తన పతాకంలో కాషాయరంగును నిలుపుకుని- దేశ పవిత్రతను కాషాయమని ఎగతాళి చేస్తుందో! ఏ పార్టీ అధినేతకు భారత సంస్కృతీ సాంప్రదాయాలూ, జాతి సమైక్యత అనిష్టమో- అలాటి దురస్థితిని పౌరులు కోరని జాతీయ పతాకానికీ, ధర్మచక్రానికీ నమస్కరిద్దాం!

దేశదేశాల్లో భారత దేశ ఔన్నత్యాన్ని చాటిచెబుతూ, కీర్తి ప్రతిష్టలు సంపాదించుకువస్తున్న భారత ప్రధాని నరేంద్రమోడీకి శుభాకాంక్షలందచేద్దాం.



-మరల ఎమర్జెన్సీ రోజుల ప్రమాదాన్ని గొని తెచ్చుకోవద్దు-

# 1857 సం॥ములోని వీరస్మృతిని స్మరించుకోకుండా భారత స్వాతంత్ర్య ఫలసిద్ధి పొందలేము!



1857వ సంవత్సరం భారతదేశ చరిత్రలో మరచిపోలేనిది. మధుర స్మృతులు విషాదజ్ఞాపకాలతో నిండిన ఏడాది అది. విదేశీ పాలకుల్ని ఎదిరించడంలో మనవీరులు చూపించిన సాహసాలు నిజంగానే మనకు వీరస్మృతులు అయితే ఈ వీరోచిత పోరాటంలో వారు తమ ప్రాణాలను కోల్పోవడం విషాదకర జ్ఞాపకం. ఈనాటి వేగపు యుగంలో నూటయాభై సంవత్సరాలు సుదీర్ఘ సమయమే అయినా, ఆనాటి ఘట్టాలను నేటికీ భక్తితో మనం గుర్తు చేసుకోవాలి.

ఆనాటి తిరుగుబాటు పర్వంలో ఎందరెందరో వీరులున్నారు. తాంతియాతోపె, ఝాన్సీలక్ష్మిబాయి, నానాసాహెబ్, ఆజీమ్ ఉల్లాఖాన్, బహుదూర్షా బేగం, హజ్రత్ మహర్ ఇట్టా ఇలా ఎంతో మంది. వీరంతా ఆనాటి పోరాటంలో వీరత్వాన్ని చూపించారు.

1857 తిరుగుబాటును విశ్లేషించుకునే క్రమంలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు తెలుస్తాయి. ఇంగ్లీషువారు ఆనాటికే మాయాజాలంలో రాటు దేలారు. వలస పాలనలో కళాప్రపూర్ణులయ్యారు. ఐకమత్యమే బలమన్న సూక్తిని, ఆయుధసంపత్తిని సాధించుకున్నారు. సామదాన భేద దండోపాయాల్లో నిపుణులయ్యారు. మన యావత్ భారతదేశం విస్తరించారు. యుద్ధాన్ని ప్రకటించిన మన భారతీయ వీరులలో ఇవేమీ లేవు. భారతీయ వీరకిశోరాలు ధర్మయుద్ధపరిధిలో వున్నారు. ఊహాత్మకంగా యంత్రాంగం లేదు. ఉన్న అరకొర ఆయుధాలూ తాతల నాటివి. ఐకమత్యం లేదు. కౌటిల్య వ్యూహాలను యెరుగరు. ఇంగ్లీషువారితో మన వీరులు తుదిదాకా పోరాడారంటే స్వతంత్ర్యాత్మక దీక్ష ఉద్విగ్నతలు కారణం. వారి ఆవేశాలు కొన్ని సందర్భాలలో విఫల ఫలితాన్ని అందించవచ్చు కాని అవి సంచనాలని సాధించలేవు. కొన్ని కొన్ని సందర్భాల్లో భవిష్య చరిత్రకు కొత్త పుటలని కూడా తయారు చేయవచ్చు. 1857 పరిణామ పోరాట సత్యాల్ని తిరిగి చెప్పాలి. బ్రిటిష్ పాలన పరిణామాలపై మన జాతి జీవి సంపదలను దోపిడీ చేసినదన్న నిజం మన అవగతమవ్వాలి. సంస్కరణల మాయలో, ఆధునిక విలువల ముసుగులో బ్రిటిష్‌వారు చేస్తున్న తప్పిదాలు మన అవగాహనలోకి రాలేదు. బ్రిటిషుపాలన పరిణామాలపై మనమేధావులు నిరసన తెలిపేందుకు 1857 నాటి యుద్ధమే ప్రాతిపదిక. 20వ శతాబ్ది ఆరంభంలో తలెత్తిన బెంగాలీ విప్లవవాదం 19వ శతాబ్దంలో దాదాబాయి నౌరోజీ ప్రకటించీన పీడన సిద్ధాంతం (డ్రాన్ థియరి) 1857 తిరుగుబాటు నేపథ్యంలో నుండే ఆవిష్కరించబడ్డాయి.

నిన్నమొన్నటి దాకా సిపాయిల తిరుగుబాటుగా వర్ణన పొందిన ఆనాటి మహోత్తర పోరాటాలపై కొత్త విశ్లేషణలు జరగాల్సిన అవసరమున్నది. బ్రిటిషు అనుకూల మేధావుల సమాచారం ఆధారంగా తయారయిన ఆనాటి పోరాటం సత్యాలు తెలియాల్సిన అవసరముంది. వీరుల త్యాగ నిరతికి వెల వుండదు. వారి త్యాగాల పట్ల కృతజ్ఞతా పూర్వకంగా స్పందిస్తూ కొంత రుణాన్ని తీర్చుకోవచ్చు. ప్రథమ భారత సంగ్రామంలో నేలకొరిగిన వటవృక్షాలను గుర్తుచేసుకుందాం వారికి సవినయంగా అంజలి ఘటిద్దాం. వారి వీరోచిత వ్యక్తిత్వాలను కొత్త సిరాతో వ్రాసుకుందాం. 1857 సంవత్సరాన్ని ఎల్లప్పుడు స్మరణ చేసుకుందాం. వారి చిత్తశుద్ధిని గుర్తు చేసుకుందాం. వారి దేశభక్తికి గర్వమందుదాం. ●

# కుటుంబ వైభవం (మన్నారు మనోహరచెట్టి కుటుంబం)



ఉపన్యాస శిరోమణి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు చెన్నయ్ కుచలాంబాళ్ కల్యాణమండపంలో అక్టోబర్ 1, 2, 3 తారీఖుల్లో మూడు రోజులు 'కుటుంబ వైభవం' గురించీ ఉపన్యసించారు. ఆయన ఉపన్యాసం కోసం ఉవ్విళ్ళూరుతూ వచ్చేవారెందరో! ఎందరెందరో! వారి ఉపన్యాసం వినడానికి రోజూ 3000 మంది వచ్చేవారు. గంటన్నరపాటు ఆయన గ్రుక్క త్రిప్పుకోకుండా ఆయన చెప్పడం, శ్రోతలు మెడత్రిప్పకుండా వినడం చూశాను. ఇతిహాసం విన్నారా? ఆ అతి సాహసికులున్నారా అన్నపాట వీనుల్లో ప్రతిధ్వనించింది. "ఆఁ- ఉన్నారంటూ నా మనం చెప్పింది. ఎవరని ప్రశ్నించుకుంటే ఎం. మనోహర చెట్టి కుటుంబం అన్నది.



# శ్రీమతి సౌజన్య W/O యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

**బ**రువు బాధ్యతలన్నీ ఆమెవి! పరువంపు పేరులు ఆయనవి. మనం W/O అంటాం. దేవతలేమో H/o (హజ్‌బెండు ఆఫ్) అంటారు. **కొత్త శీర్షిక! కొసరి కొసరి చదవండి!**

**తి**రుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయములు నాటకంలో – కృష్ణుడు తన్ను సహాయం కోరవచ్చిన అర్జున, దుర్యోధనుల్లోని – దుర్యోధనుని గాంచి– 'బావా ఎప్పుడు వచ్చితీవు! భవదీయ సేమంబు కోరు భీష్ముండు సుఖమే కదా' అని ప్రశ్నిస్తాడు. భీష్ముడు సేమంగా ఉంటే – కౌరవులంతా సేమమే అన్నది పద్యభావం.

భవదీయ భర్తలెల్లరు సేమము కదా అని, వ్యాస ప్రారంభాన్ని సమర్థించు కుందాం. భర్త సేమం కోరు భార్య ఎంతటి భారాన్ని వహిస్తుందో యెందరు భర్త లెరుగుదురు! వృత్తి ప్రవృత్తి రీత్యానో, మాతృ పితృ జాతీయ భాషల సేవగానో, రాజకీయ పదవిగానో రోజులకు రోజులు, వారాలకు వారాలు, పక్షాలు, నెలలు, యిల్లు విడిచి వెళ్ళే భర్తలు కల భార్య భారం బహు భారమే!

భర్తయన్నవాడు కాబోయే భార్యను పెళ్లిచూపుల్లో నిస్సిగ్గుగ చూడడు; చూడలేదు. చూచినా అతని చూపు ఓ లక్ష్యంపై నిమగ్నమై ఉంటుంది. ఈ భావనను దీర్ఘ దృష్టితో దర్శించిన విశ్వనాథ రామాయణ కల్పవృక్షంలో వారేమ్మన్నారో చూడండి.

**అతని దృష్టికి జానకి యానలేదు**
**అతని కృషికి శివధన స్సాగలేదు**
**సీత పూజెద వెన్నుగా శిరమువంచె**
**చెరుకుగడవోలె నడిమికి విరిగె ధనువు**– అన్నారు.

రాముడికి లక్ష్యం మీదనే దృష్టి. వివాహానికి ముందు విశ్వామిత్రులతో వెళ్లేటపుడు ధనువును పట్టివెళ్లాడు. సీతా స్వయంవరంలో ధనువు బట్టాడు, విరిచాడు. మగువ మనస్సు స్వంతం చేసుకున్నాడు. లక్ష్మణుడేమీ తక్కువ కాదు; పెళ్లికి ముందు ఊర్మిళను చూడనేలేదు. శ్రీరామునితో లక్ష్మణుడు అరణ్యాల్లో వాసం చేసిన పదునాల్గు సంవత్సరములూ ఆమె లక్ష్మణుని స్మరిస్తూ నిద్రలోనే ఉంది. ఆయన ధ్యాసలోనే ఉంది. ఇది ఊర్మిళ గొప్పదనం.

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఊరే సౌజన్య ఊరు. ఆ యింటివారూ ఈ యింటివారూ యెరుకగలవారే. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాదూ, సౌజన్య లిరువురూ ఒకే గ్రామవాసులూ, ఉపాధ్యాయకుటుంబీకులూ! ఒకరి సేమంబులొకరెరిగిన సౌజన్యపూరిత ప్రసాదులు! బోధకభావాలూ, చోదక భావాలూ ఒక్కటిగానే ఉన్నాయ్. ఎవరు ఎక్కడన్నా ఒక్కరే నన్న చిక్కని చక్కదనం అక్కడే పుట్టింది. ఆమె తిరుచాన అంటే శ్రీ కాంత. శ్రీ అంటే శ్రీ మహావిష్ణువుకు కాంత. సౌజన్యను పెళ్లాడి లక్ష్మీ ప్రసాదుడయ్యాడనుకుంటా! సౌజన్యత్వం గల బోధకురాల్ని చేబట్టడంతో– సౌజన్య లక్ష్మీవరప్రసాదుడు అని అనవచ్చు. అతడు ఎవరినైనా పలుకరించడంలో ఆప్యాయత, ఆనందం బుస్సున పొంగుతాయ్.

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారి కుటుంబీకులు రెండు మూడు తరాలలోనివారు ఉపాధ్యాయులు. ఆయన, ఆమె పుట్టిందీ కృష్ణాజిల్లా. ఒకే ఊరు. ఇప్పటి ఇరువురి విలాసం విశాఖపట్టణం. ఆయన విశాఖ నుంచే విశాల విశ్వమంతా పర్యటిస్తుంటాడు. విశ్వగడా లక్ష్మీప్రసాదుడు!

ఆయన అదృష్టమల్లా సౌజన్యురాలైన సౌజన్య పాణిగ్రహణం వల్లనని చెప్పాలి. ఎప్పుడో చదివిన పత్రికా వార్త నా మెదడులో అచ్చుయింది! ఆయన ఊళ్లు, సాగరాలు దాటి దేశాలు వెడ్తుంటారు. ఇల్లును చక్కగా చక్కపెట్టు సౌజన్యురాలు సౌజన్యే నని ఎక్కడో చదివాను. సౌజన్యంగా పిల్లల పెంపకం, మరింత సౌజన్యంగా అత్తమామలకు సేవ చేయడం! ఆడపడుచుల పెళ్ళిళ్లు, మరుదుల మంచి చెడులూ, అన్నీ w/o శ్రీమతి సౌజన్యా లక్ష్మీప్రసాదే!

లక్ష్మీప్రసాదల్లా లక్ష్మీనారాయణస్తు అని దీవించడమే.

లక్ష్మీప్రసాద్‌గారి తల్లి పాఠశాలలో సౌజన్య సహ ఉపాధ్యాయురాలు కావడం, సౌజన్య హృదయాన్ని ఆమె అధ్యాపకురాలుగా గ్రహించడం, సౌజన్య విద్యార్థికుణ్ణి పెళ్లి చేసుకుకోవాలనుకోవడం వెరసి – లక్ష్మీప్రసాద్ గృహజీవితం తేనెలో పడ్డ రొట్టయింది.

లక్ష్మీప్రసాద్ తల్లితండ్రులూ అమ్మమ్మా ఉపాధ్యాయులు కావడం వల్లనేమో లక్ష్మీప్రసాద్ జాతీయ భాష హిందీ భాషపై మక్కువను పెంచుకుని హిందీ అధ్యాపకుడైనారు. విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో హిందీ ఉపాధ్యాధికుడు కావడం విశాఖ వాసిని చేసింది. విశ్వవ్యాపకత్వాన్ని పెంపుచేసింది. వెన్నంటి ఉన్న భార్య సౌజన్య సౌజన్యమే! ఒక ఆదది వెనుక ఒక మగవాడు (భర్త)తోడుగా ఉంటే ఆ భర్త కర్తృత్వానికి ధోకా ఉండదు. హైదరాబాద్, ఢిల్లీ, బొంబాయిలు దాటి అమెరికా, కెనడా, లండన్ లంతా పర్యటించి, హిందీ వ్యాప్తితో తెలుగు భాషానురక్తిని కలిగింపచేయడానికి గల వెనుక వెలుగు సౌజన్య సౌజన్యమే.

హిందీ ప్రచారకునిగా సింధు దేశం యెల్లలు దాటిపోయాడు. త్రివిక్రమునిలా మరోకాలు బయటపెట్టి దేశదేశాలు పర్యటించి తెలుగు క్షేత్రం, సేద్యం చేస్తున్న రైతుగా, రౌతుగా మారడానికి కూడా భార్య సౌజన్య బలమూ సౌజన్యం గల బలగమే!

**ల**క్ష్మీప్రసాద్ లక్ష్మీ సరస్వతి వరప్రసాదుడు. అధ్యాపకునిగా, ఆచార్యునిగా, ఆర్ష ధార్మిక నవలా రచయితగా, రాజ్యసభ సభ్యునిగా – ఇంకా ఇంకా ఇంకిపోని ప్రతిభతో రాణించడానికి వెనుక ఎలిజిబిత్‌రాణిలా సౌజన్య ఎలివేట్ అయింది. ఇవన్నీ ఈ వ్యాసన్యాసానికికంతగా, అవసరం కానివియైనా, సనాతన దంపతుల్లోనూ సంతోష సంతాన దంపతుల్లోను ఉండవలసిన 'సౌజన్య' లక్షణాలు కాబట్టి చెప్పుకుంటున్నాం.

ఇంటికి దీపం ఇల్లాలు అని పెద్దలు అన్నారు. ఇల్లాల్ను చూసి, పిల్లల పెంపకాల్ని చూసి, ఆ యిల్లు 'స్వర్గసీమ' అనుకోవాలి. అందరు యిల్లాళ్లు ఇలా ఉంటే క్రమ శిక్షణగల పిల్లలు పెరుగుతారు. భావి పౌరులవుతారు, భారత భాగ్యోదయులవుతారు.

భార్యభర్త కర్తకృత్యములు సరిగా ఉంటే, వారిల్లు నందనవనం– వారి కారణాన దేశమూ నందనవనము! తల్లితండ్రులు క్రమశిక్షకులైతే క్రమశిక్షణ గల పిల్లలు మణిపూసలవుతారు. గడప చూస్తేనే గృహిణి ఔన్నత్యం తెలుస్తుంది.

**కథా-సంగ్రహం**

**"మా ఊరు విజయవాడ సమీపంలోని గుంటుపల్లి. మాది వ్యవసాయదారుల కుటుంబం. నేను ఆ యింట్లో ఆఖరి అమ్మాయిని కావడంతో మా వాళ్లు చాలా గారం చేసేవారు. ఇంటర్ వరకు చదివాను. చదువంటే నాకు ఆసక్తి ఉండడం వల్లేమో... విద్యావంతుడైన అబ్బాయి భర్తగా దొరకాలనుకునేదాన్ని. 34 ఏళ్ల క్రితం యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారితో నా వివాహం జరుగడంతో నా కల నెరవేరింది. వారిది గుడివాడలోని బేతవోలు. ఉపాధ్యాయులు కుటుంబం నుంచి వచ్చారు. మా అత్తమామలు ఇద్దరూ టీచర్లే. అలాగే ప్రసాద్ గారి అమ్మమ్మగారు కూడా ఉపాధ్యాయురాలే. ఆమెతో మా కుటుంబానికి బాంధవ్యం ఉండేది. ఆమె మా గుంటుపల్లిలోనే టీచర్‌గా పనిచేసేవారు. ఆ విధంగా లక్ష్మీ ప్రసాద్‌గారి సంబంధం ఖాయమయ్యేందుకు వీలయింది. పెళ్లి పీటలమీదనే చూశాను. మా అమ్మానాన్నల ఒళ్లో చిన్నకూతురిగా సున్నితంగా పెరిగిన నేను యార్లగడ్డ వారింట పెద్దకోడలి నయ్యాను. ఉమ్మడి కుటుంబం. కొత్త ప్రపంచం. మొదట్లో కొంత ఆందోళన చెందినా త్వరలోనే ఆ ఇంట్లో కూతురిస్థానం పొందాను. మా అత్తమామలు నన్ను అంత ప్రేమగా చూసుకున్నారు. నలుగురు ఆడపడుచులు. ఇద్దరు మరుదులు. బాధ్యతలు ఎక్కువే ఉండేవి. అన్నింటినీ ప్రసాద్‌గారి అండతోనే నెగ్గుకొచ్చాను.** ●

# పంచాంగ వాచస్పతి
# మధుర కృష్ణమూర్తి

ఆయనకు తొంభై యేళ్లంటే ఎవరూ నమ్మరు! పంచాంగ సిద్ధాంత కర్తల్లో 'మధుర' వారిదో ప్రత్యేక సిద్ధాంతం.

పిడపర్తివారు, తంగిరాల వారూ, నేమానివారూ సుప్రసిద్ధ పంచాంగ సిద్ధాంతులు. వీరందరూ చాంద్రమాన సిద్ధాంతపరంగానే పంచాంగాలు రూపొందిస్తుంటారు. కృష్ణమూర్తి శాస్త్రిగారి సిద్ధాంతం సౌరసిద్ధాంతమే అయినప్పటికినీ– వారి లెఖ్ఖలు వారివే. వారి జ్యోతిశ్శాస్త్ర లెఖ్ఖలను వారు గుణీకరించి చూపిస్తారు.

I SERVE పరంగా బ్రహ్మశ్రీ కుప్పా వెంకట కృష్ణమూర్తిగారు మూడు రోజులపాటు నిర్వహించిన పంచాంగ సదస్సులో నేను మధురకృష్ణమూర్తి శాస్త్రిగారి, జ్యోతిష్య గణితోపన్యాసం విన్నాను. వారితో కొంత సేపు మాట్లాడాను. వారి మాట సొరును గ్రహించాను. అప్పటి కృష్ణమూర్తిశాస్త్రిగారినీ రాజమండ్రిలోని గోదావరి పుష్కర ఉత్సవాల సందర్భంలో చూచినపుడూ– ఏ శరీరమార్పు కనిపించలేదు.

అల్లసాని పెద్దనగారు వర్ణించిన ప్రవరునిలా ఉన్నారు. దబ్బపండు ఛాయా, దానిమ్మ గింజలవంటి దంతాలూ, ధృఢమైన శరీరము, చెవులు, తీక్షణమైన కనుచూపుల్లో మార్పు కనిపించలేదు.

వేదశాస్త్రానికి ఉన్న షడంగాల్లో జ్యోతిషం నయనస్థానానికి చెందినది. శాస్త్ర విహిత కర్మలు చేయవలసిన సమాయాల్లోచేస్తే ఆశించిన ఫలితాలు, చేయకూడని సమయాల్లో చేస్తే విపరీత ఫలితాలు వచ్చే ప్రమాదమూ లేకపోలేదు. ఇక్కడి వరకు పండితులందరూ ఏకీభవిస్తారు. పండుగల తేదీలు, సమయాలపై వివాదాలు పరిపాటి అయ్యాయి. ఆరుదశాబ్దాలుగా ఆయన జ్యోతిషశాస్త్రంపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. విశ్వజ్ఞాన ప్రతిష్ఠానం, జ్యోతిష విజ్ఞాన కేంద్రం అనే రెండు సంస్థలను రాజమండ్రిలో స్థాపించారు. ఏటా దేశవ్యాప్తంగా ఉన్న జ్యోతిష దిగ్గజాలను పిలిపించి సదస్సులు నిర్వహిస్తున్నారు. వృద్ధాప్యం శరీరానికే కాని, మనసుకు లేదని నిరూపిస్తున్న మధుర శాస్త్రిగారు పుష్కర తేదీలు ఎలా ప్రామాణికమైనవో, పంచాంగకర్తలు అనుసరిస్తున్న పద్ధతులలో లోపాలు ఎలా ఉన్నాయో వివరించారు.

**సూర్యసిద్ధాంతమే ప్రమాణం!**

"దేశంలోని పంచాంగాలన్నిటికీ సూర్యసిద్ధాంతమే ప్రమాణం. అందరూ అంగీకరించిన విషయమే! సూర్యుడు అశ్వినీ నక్షత్రం ప్రారంభ బిందువు నుంచి



బయలుదేరి తిరిగి అదే బిందువును చేరడానికి 365 రోజుల 15 ఘడియల 31 విఘడియల 31 పరల సమయం పడుతుందని సూర్యసిద్ధాంతం తెలియజేస్తున్నది. ఇదో సౌరవర్షం. అయితే వర్తమానంలో 'వేదశాల' (అబ్జర్వేటరీ) ద్వారా పరిశీలిస్తే పై సౌరప్రమాణంలో 8 విఘడియల 30 పరలు తేడా కనిపిస్తోంది. అంటే ఒక సంవత్సరానికి 3 నిమిషాల 24 సెకన్లు తేడా వస్తోంది. ఈ తేడాలను లెక్కలోకి తీసుకోకుండా పంచాంగ గణనం చేయడం సరికాదు. గ్రహగమనాలు మారుతుంటాయన్న విషయాన్ని పంచాంగ కర్తలు పరిశీలనలోకి తీసుకోవాలి.

**రిఫార్మ్ కమిటీ ఆధ్వర్యంలో..**

మరో ముఖ్య విషయాన్ని ప్రస్తావించక తప్పదు. పంచాంగాలలో ఏకీకరణను సాధించడానికి తొలి ప్రధాని నెహ్రూ 1952లో కేలండర్ రిఫార్మ్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా నియమితులైన ఎస్.సి. లాహిరి తప్ప ఆ కమిటీలో జ్యోతిష శాస్త్రంలో కృషి చేసినవారు ఎవరూ లేరు. నక్షత్ర గ్రహగతులలో మార్పు కలుగుతూ ఉంటుందని, దీనివలన అయనాంశాన్ని మార్చవలసి ఉంటుందని కమిటీ సమావేశాల్లో కొందరు సూచించారు. స్థిరమైన అయనాంశ అన్నది శాస్త్రవిరుద్ధమని కొందరు తేల్చి చెప్పారు. అయితే, ఇంతటి గంభీరమైన పై విషయాన్ని కుంటిసాకుతో లాహిరి తిరస్కరించారు. ఆ సందర్భంగా ఎన్.సి. లాహిరి 'ఈ దశలో అయనాంశలో మార్పులుకూర్పులు చేయాలంటే, గతనాలుగు సంవత్సరాల పంచాంగాలను మార్పు చేయవలసి ఉంటుంది. అది ఎంతో శ్రమతో కూడినపని అని పేర్కొన్నారు. తప్పు అన్నది తేలాక కూడా, కుంటుసాకుతో దేనికి అన్నట్టు ఓ పత్రికా ప్రసంగం ఆధారం.

# గురువు రాజుకన్నా గొప్పవాడు!

గురువు యెంతో గొప్పవాడు. రాజుకన్నా గొప్పవాడు. రెండవ చార్లెస్ ఇంగ్లాండు రాజుగా ఉన్నప్పుడు – డాక్టర్ బస్‌బీ హెడ్మాస్టర్‌గా ఉన్న హైస్కూలుకు వస్తానని కబురు పంపాడు. అందుకు సంతోషపడాల్సిన ఆ హెడ్మాష్టర్‌గారు – మీరు దయచేసి రావద్దు, వస్తే, నేను, రాజమర్యాద కోసం తలపైనున్న పాగాను తీయాలి. ఇంతవరకూ నా బడిపిల్లందరూ నేనే గొప్పవాడనుకుంటున్నారు. మీరు వస్తే– నా తలపాగా తీయాలి. ఆ కారణంగా నా ఆధిక్యత తగ్గిపోతుంది. పిల్లల్లో భయం, క్రమశిక్షణ పోతుంది. దయవుంచి పెద్ద మనసుతో అర్థం చేసుకోండి అంటూ విజ్ఞాపన పంపాడు.

వెంటనే చార్లెస్ రాజు– "మీస్కూలు అనుకున్న ప్రకారం వస్తున్నాను. మీరు రాచమర్యాదల్ను పాటించనవసరం లేదు. ఒక ఆదర్శ ఉపాధ్యాయునిగా మీ పెద్దరికాన్ని గౌరవిస్తూ– నేనే నా హాట్ (టోపీ) తీసి శిరస్సు వంచి గౌరవిస్తాను" అంటూ కబురు పంపించాడు.

గురువు (ఉపాధ్యాయుని) పట్ల గౌరవమర్యాదలు చూపే సంస్కృతి ఇంగ్లాండు లోనూ ఉండేది. మనదేశంలో ఛత్రపతి శివాజీ వంటి మహారాజులు గురువుల పట్ల అంతటి గౌరవ మర్యాదలను పాటించారు.

నేను ఉపాధ్యాయునిగా పనిచేసినపుడు కూడా అంతటి గౌరవమర్యాదలూ ఉన్నాయ్. ఒకసారి నేను పోడూరికి ఓ సినిమాషూటింగు సందర్భముగా వెళ్ళినపుడు అక్కడి పెద్దలతో మాట్లాడుతున్నాను. ఇంతల్లో ఎం.ఎల్.ఏ గారు వస్తున్నారు. ఎం.ఎల్.ఏ. గారు వొస్తున్నారు– అంటున్నారు. భయభక్తులతో లేచి అందరూ నిలుచున్నారు. నేను కూడా నిలబడి ఉన్నాను.

ఎం.ఎల్.ఏ. గారు రాగానే ఎంతో భయభక్తులొలకపోస్తున్నారు. ఆయన నా దగ్గరకు వచ్చి– "మీరు కూర్చోండి గురువుగారూ! నేను మీ వద్ద చదువుకున్న శిష్యుణ్ణి"– అంటూ నమస్కారం పెట్టాడు.

అప్పుడక్కడ ఉన్న వాళ్ళందరూ– నన్నేదో గొప్పగా భావిస్తూ (పలుకరించనివారు సహితము) నమస్కారం పెట్టారు.

గురువుల పట్ల అంతటి గౌరవమర్యాదలు చూపిన సంస్కారవంత దేశం మనది. స్వతంత్రం సిద్ధించాక యీ గౌరవమర్యాదలన్నీ చచ్చుబడ్డాయ్! ●

SRI RAJARAJESWARI
JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times*
*Afford is Spotless Reputation*



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



95

## పదునేడవ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగయోగము

**12. అభిసన్ధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్**
**ఇజ్యతే భరతశ్రేష్ఠ తంయజ్ఞం విద్ధి రాజసమ్.**

**వ్యాఖ్య :-** ఫలమునుగోరి చేయబడు కర్మచే చిత్తశుద్ధి యెన్నటికిని కలుగనేరదు. చిత్తము శుద్ధము కానిచో ఆత్మతత్త్వము ప్రకాశింపదు (అనుభూతముకాదు). కావున అట్టి ఫలాభిసంధియుక్తమగు వేషము కొఱకు, డంబము కొఱకు చేయబడు కార్యమున్ను రాజసమేయని యిట పేర్కొనబడినది. కాబట్టి వానినెవరును ఆశ్రయించ రాదు.

**13. విధిహీనమసృష్టాన్నం మన్త్రహీనమదక్షిణమ్**
**శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే.**

**వ్యాఖ్య :-** 'అనుష్టాన్నమ్' - అన్నదానమనునది అనుష్ఠానవేదాంతము యొక్క ఒకానొక స్వరూపము. సర్వభూతములందును పరమాత్మ కలడను సత్యము ననుభూత మొనర్చుకొనినవాడు పరోపకారము తప్పక చేయును. అదియే ఆచరణవేదాంతము అందువలననే కాబోలు అన్ని పుణ్యకార్యములందును శ్రాద్ధాదులందును, యజ్ఞము లందును అన్నదానమును పెద్దలు విధించిరి. తనవలె ఎల్లప్రాణులను చూచునట్టి గొప్ప సాధన ఈ అన్నదాన కార్యమువలన లెస్సగ అనుభవమునకు రాగలదు. కావున ఇట్టి పవిత్రమగు అంగము కొఱతపడిన తామసమేయని భగవానును పలికిరి.

'ఆదక్షిణమ్' - ఇదియు పైనదెల్పిన అన్నదానమును బోలినదే. తన సొత్తులో కొంత భాగమును ఋత్విక్కులకు, బీదలకు, దరిద్రనారాయణులకు దక్షిణగా నొసంగ వలెను. ఇది త్యాగమునకు చిహ్నము. కావున ఇట్టి త్యాగభావము లేని యజ్ఞము తామసమైనదని గీతాచార్యులు పేర్కొనిరి.

'శ్రద్ధావిరహితమ్' - ఏ కార్యమునైనను శ్రద్ధతో, భక్తితో పరిపూర్ణ విశ్వాసముతో చేయబడినప్పుడే ఉత్తమ ఫల మొసంగగలదు. శ్రద్ధ లేకుండ చేయబడు కార్యము చేయని దానితో సమానమేయని ఈ అధ్యాయముననే ముమ్ముందు భగవానుడు చెప్పబోవుదురు. (అశ్రద్ధయా హుతం - అసదిత్యుచ్యతే...) కావున శ్రద్ధారాహిత్య మును, తామసప్రవృత్తిని విడనాడి జనులు శ్రద్ధాసమన్వితులయే సమస్త కార్యములను ఆచరించి ఉత్తమఫలములను బొందవలయును.

**14. దేవద్విజగురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్**
**బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే**

**వ్యాఖ్య :** శారీరక, వాచిక, మానసికములను త్రివిధ తపస్సులను గూర్చి చెప్పబడిన ఈ ఘట్టము (14, 15, 16 శ్లోకములు) చాలా ముఖ్యమైనవి. సాధకులు ఈ మూడు విధములైన తపస్సులను చక్కగా శీలించి త్రికరణశుద్ధులైయుండినచో ఈ అధ్యాయమున ఆహారము, యజ్ఞము, దానము అనువానిని గూర్చి చెప్పునప్పుడు వానియొక్క సాత్త్విక, రాజస, తామస రూపములనేగాక, తత్సంబంధమైన శారీరక, వాచిక, మానసిక తపస్సులనుగూడ వక్కాణించిరి. ఉపాధియందలి (ఇంద్రియాలందలి మాలిన్యములను బాగుగ తపింపజేసి వానిని తొలగించుటయే తపస్సు. అదియో మోక్షమునకు హేతువు. పరమార్థ సాధనలలో అది చాలా ప్రధానమైనది. అందువలననే కాబోలు గీతాచార్యులు తపస్సును గురించి చెప్పునప్పుడు అన్నిటివలె సామాన్యముగ చెప్పక ప్రత్యేకించి మరల మూడువిధములుగా చెప్పిరి. జనులలో కొందరు తపస్సను మాట వినగనే భీతిల్లుచుందురు. ఎండలో, వానలో బాధ జెందుటయే తపస్సని వారి భావము. కాని శ్రీకృష్ణపరమాత్మ తపస్సునుగూర్చి యిచట గావించిన వివరణమును, వ్యాఖ్యను పరిశీలించినచో ఇక వారట్టి భీతిజెందనవసరము లేదని, స్పష్టము కాగలదు. భయంకరములైన తపస్సులను గూర్చిన ప్రస్తావనయే ఇచట లేదు. కాబట్టి సులభసాధ్యములై, సర్వులకును ఆచరణ యోగ్యములైనట్టి ఈ త్రివిధ తపస్సులను ప్రతివారును స్త్రీలును, పురుషులును చక్కగ ఆచరించి శరీర వాఙ్మనంబులను శుద్ధమొనర్చుకొని మోక్షభాగులు కావలయును.

ఈ శ్లోకమునందు శారీరక (శరీరసంబంధమైన) తపస్సు చెప్పబడినది. ఇందు ఐదు సాధనలు వచింపబడినవి. (1) మొట్టమొదట పెద్దల సేవనము, పూజనము పేర్కొనబడినది. (దేవద్విజగురుప్రాజ్ఞ పూజనమ్). పెద్దలను, బ్రహ్మనిష్ఠులను పూజించుటవలన, సేవించుటవలన రెండు మహత్తర సత్ఫలితములు సాధకునకు కలుగగలవు. అవియేవియనిన - (1) వారియొక్క అనుగ్రహము లభించుట (2) తనయొక్క అహంకారము, అభిమానము శమించుట. ఆధ్యాత్మ మార్గమున సర్వేశ్వరుని యొక్కయు, సద్గురుని యొక్కయు, మహాత్ములయొక్కయు అనుగ్రహము లేనిచో దుస్తరమగు మాయ ఎవరికిని దారి నొసంగదు. ప్రతిబంధకములు తొలగవు. అత్తఱి జనులు పరమార్థరంగమున ముందుకు జనుట చాలా కష్టము. కాబట్టి వారియొక్క పూజా, సేవాదులచేతను, వారియెడల వినయ విధేయతలను జూపుట వలనను, వారి యనుగ్రహమును, ఆశీర్వాదమును ఎట్లైన సంపాదించవలెను. వారి కటాక్షము ముముక్షువున కీ సాధన చాల అవసరమై యున్నది. అందులకే కాబోలు భగవానుడు మొట్టమొదట దానినే వక్కాణించిరి.

'ద్విజ' - ద్విజులనగా రెండవ జన్మయెత్తినవారు; అనగా పుట్టుకతో వచ్చిన జన్మకాక, సంస్కారముచే, సాధనచే వచ్చిన రెండవజన్మ కలవారని అర్థము. అజ్ఞానమును ఛేదించి, లేక అజ్ఞానముతో గూడిన పాతశరీరమనంబులను పొందిన వారని భావము. వారి జీవితము పూర్వజీవితమువలె నుండదు. వారియందు బ్రహ్మ తేజస్సు ప్రకాశించుచుండును.

*(తరువాయి వచ్చే సంచికలో)*

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :